రుయా అధికారులకు నోటీసులు

తిరుపతి తుడా : ఆరోగ్యశ్రీ ఆసరా నిధుల గోల్‌మాల్‌పై రుయా అధికారులకు పోలీసులు నోటీసులు జారీచేశారు. రుయా సూపరింటెండెంట్ నాగమునీంద్రుడుతోపాటు డాక్టర్ రాధారాణి, డాక్టర్ మునీశ్వరరెడ్డికి అలిపిరి సీఐ అబ్బన్న శుక్రవారం రాత్రి నోటీసులు అందజేశారు. అవకతవకలపై పూర్తి వివరాలు అందించాలని కోరారు. ఆరోగ్యశ్రీని పరిరక్షించాల్సిన మెడ్రికో పైన చర్యలకు దిగనున్నారు. ఆయా శాఖల అధికారుల నిర్లక్ష్యాన్ని ఉన్నతాధికారులు గుర్తించారు.

టాప్ ‘టెన్’ లక్ష్యం!



విద్యార్థి భవిష్యత్‌లో పదో తరగతి కీలక ఘట్టం. ఇందులో ప్రతిభే భవితకు గీటురాయి. అందుకే దీన్ని సమరంగా భావిస్తారు. విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపుతారు. అయితే ఇప్పటి వరకు పడ్డ కష్టం ఒక ఎత్తయితే.. ఇకముందు చేసే కసరత్తు మరో ఎత్తు. రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ పదో తరగతి పరీక్షల షెడ్యూలు విడుదల చేశాయి. ఏప్రిల్ 3 నుంచి ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. పరీక్షలకు సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో విద్యార్థులు పక్కా ప్రణాళికతో చదవాల్సి ఉంటుంది. ఇందుకు తగ్గట్టుగా విద్యాశాఖాధికారులు కూడా ప్రణాళిక రూపొందించి అమలు చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఈ పరిస్థితిలో పదో తరగతి పరీక్షల సన్నద్ధతపై ‘సాక్షి’ ప్రత్యేక కథనం.

తిరుపతి జిల్లా సమాచారం

పదో తరగతి రెగ్యులర్ విద్యార్థులు	-	26,673
ప్రైవేటు విద్యార్థులు	-	1,740
హాజరయ్యే విద్యార్థులు	-	28,413
పాఠశాలల సంఖ్య	-	580
పరీక్షా కేంద్రాలు	-	152

- ఉత్తమ ఫలితాల సాధన దిశగా అడుగులు
- వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ
- మెరుగైన ఫలితాలు సాధించేలా శిక్షణ
- ప్రభుత్వ బడుల్లో ప్రత్యేక తరగతులు
- పటిష్ట ప్రణాళికతో ముందుకు సాగుతున్న విద్యాశాఖ

తిరుపతి ఎడ్యుకేషన్: పదో తరగతి పరీక్షా ఫలితాలలో ప్రతిభ చాటాలని విద్యాశాఖ అధికారులు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. వంద శాతం ఉత్తీర్ణత సాధించమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నారు. ప్రతి ఒక్క విద్యార్థీ పూర్తిస్థాయిలో జీపీఏ దక్కించుకునేలా ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు. ఈ పరిసితుల్లో ఫెయిల్ అనేదానికి తావు ఇవ్వకుండా లక్ష్యం వైపు దూసుకుపోతున్నారు. ఆ దిశగా విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఇక నుంచి చేసే పునఃశ్చరణతోపాటు చదువులో వెనుకబడిన వారిని ఉత్తమంగా తీర్చిదిద్దేందుకు చర్యలు వేగవంతం చేశారు. సిలబస్‌ను పూర్తిచేసి సబ్జెక్టుల వారీగా పాఠాల వారీగా విద్యారుల జ్ఞాపకశక్తిని అంచనా వేసేందుకు రివిజన్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. వీటిని వెంటనే దిద్ది ఎక్కడ లోపం ఉందో గుర్తించి స్టడీ అవర్స్‌ను నిర్వహిస్తున్నారు. దీని కోసం ప్రత్యేక ప్రణాళికను అమలు చేసేందుకు డీఈఓ డాక్టర్ వీ.శేఖర్ చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే ప్రణాళికను తయారు చేసి పకడ్బందీగా అమలు చేస్తున్నారు. ఇందులో ప్రతీ రోజూ దినసరి నివేదికలను తయారుచేసి తిరుపతి జిల్లా బాలబాలికలు పదికి పది జీపీఏ సాధించే దిశగా జిల్లా విద్యాశాఖ నిపుణులు పర్యవేక్షిస్తున్నారు.

ప్రత్యేక సదుపాయాలు

రివిజన్ ప్రణాళికలో భాగంగా ఎలాంటి సమస్యలు రాకుండా చర్యలు చేపట్టారు. పదో తరగతి విద్యార్థులకు అదనపు సదుపాయాలను అందిస్తున్నారు. ఉదయం, సాయంత్రం స్టడీ అవర్స్‌ను నిర్వహిస్తున్నారు. రాత పుస్తకాలు, స్టడీ మెటీరియల్, కెరీర్ గైడెన్స్ పుస్తకం, పరీక్షల ప్యాడ్, స్టీల్ మెటల్ స్కేల్, మ్యాపులు, కంపాస్ బాక్స్, గ్రాఫ్ పుస్తకం, పెన్నులు, పెన్సిళ్లు, షార్ప్‌నర్, కాలుక్యులేటర్, వాచ్‌లను దాతల ద్వారా సమకూర్చుతున్నారు.

ఇవి పాటించడం ఉత్తమం

- పాఠ్యాంశాల వారీగా ప్రగతి సాధించేందుకు పక్కా ప్రణాళిక పాటించాలి.
- వీలున్నంత వరకు సెల్‌ఫోన్లు, టీవీలు, సినిమాలకు దూరంగా ఉండాలి.
- విద్యారులు వీలైనంత సేపు పాఠ్యాంశాలను రివైజ్ చేసుకుంటూ సాధన చేయాలి.
- ఆరోగ్యానికి ప్రాధాన్యతను కల్పించి క్రమపద్ధతిలో విశ్రాంతి కల్పించాలి.
- నిద్ర లేకుండా చదివినా అది ఇబ్బందికరమని గుర్తించాలి.

మారిన విధానం, ప్రశ్నపత్రం

ఈ ఏడాది పదో తరగతి పరీక్షల విధానం కొంత మారింది. నమూనా ప్రశ్నపత్రాలను రాష్ట్ర విద్యాశాఖ విడుదల చేసింది. గత ఏడాది పబ్లిక్ పరీక్షల్లో భౌతిక, రసాయన శాస్త్రాలు, జీవశాస్త్రం సబ్జెక్టులకు పరీక్షను విడివిడిగా పెట్టారు. మారిన పరీక్షల విధానంలో భాగంగా ఈ ఏడాది నుంచి పీఎస్, ఎన్ఎస్ సబ్జెక్టులను ఒకే ప్రశ్నపత్రంలో ఇవ్వనున్నారు. నిరంతర సమగ్ర మూల్యాంకనం విధానంలో ప్రశ్నలను ఇవ్వబోతున్నారు. బిట్ పేపరును విడిగా ఇవ్వడం లేదు.

విజయసాధన పరీక్షలు రాస్తున్నాం



ఏప్రిల్‌లో జరగనున్న పబ్లిక్ పరీక్షలకు సంబంధించి ఇప్పటికే ఒక అవగాహనకు వచ్చాను. మా పాఠశాలలో రోజూ ఉదయం, సాయంత్రం విజయ సాధన పరీక్షలు రాస్తున్నాం. అన్నీ సబ్జెక్టులలో పాఠ్యాంశాలు వారీగా జరుగుతున్న ఈ పరీక్షలు పూర్తి స్థాయిలో అవగాహన చేసుకుంటున్నాం. మంచి మార్కులు తెచ్చుకోవడానికి మా ఉపాధ్యాయులతో సందేహాలు నివత్తి చేస్తున్నారు.

- స్పందన, పదో తరగతి, జెడ్పీహైస్కూల్, కల్లివెట్టు, బీఎన్.కండ్రిగ

ఇంటివద్దకే వచ్చి..



రోజూ విజయ సాధనతో పరీక్షలు రాయడం చేత భయం తొలగిపోతోంది. మా పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అందరూ పాఠశాలలో బోధనతో పాటు రాత్రి పూట సందర్శనలో భాగంగా మా ఇంటి వద్దకు వచ్చి తల్లిదండ్రులకు మా సామర్థ్యాలను తెలుపుతూ సందేహాలు తీర్చుతున్నారు. ఈ నెల రోజులు పిల్లలకు చదువుకునే వాతావరణం కల్పించాలని చదువు ప్రాధాన్యత మా తల్లిదండ్రులకు తెలుపుతున్నారు.

- భవ్య, కావ్య, పదో తరగతి, జెడ్పీహైస్కూల్, కల్లివెట్టు, బీఎన్.కండ్రిగ

మంచి ఫలితాలు సాధిస్తాం



పదో తరగతి పబ్లిక్ పరీక్షలో మంచి ఫలితాలు సాధించే దిశగా అన్ని చర్యలు తీసుకున్నాం. హెచ్ఎంలు, ఉపాధ్యాయులకు అందిన సూచనలకు అనుగుణంగా మంచి ఫలితాలు రాబట్టేందుకు కృషి చేస్తున్నాం. విద్యార్థులకు ఉదయం, సాయంత్రం స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నాం. వెనుకబడ్డ అంశాలపై దృష్టి సారిస్తున్నాం. విద్యార్థుల ఇళ్లకు వెళ్లి ఇంట్లో చదువుకునే వాతావరణం కల్పించేలా ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. పబ్లిక్ పరీక్షా ఫలితాల్లో జిల్లాను టాప్‌లో ఉంచడమే లక్ష్యంగా అందరూ కలిసికట్టుగాగా కృషి చేస్తున్నారు.

- డాక్టర్ వి.శేఖర్, జిల్లా విద్యాశాఖాధికారి, తిరుపతి

నేడు, రేపు ఉచిత హియరింగ్ పరీక్షలు

తిరుపతి తుడా: వరల్డ్ హియరింగ్ డేను పురస్కరించుకుని స్థానిక కొంకా వీధిలోని తిరుపతి స్పీచ్ అండ్ హియరింగ్ సెంటర్‌లో శని, ఆదివారాల్లో ఉచిత హియరింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్టు డాక్టర్ పి.గోపీనాథ్ తెలిపారు. ప్యూర్‌టోన్ ఆడియో మీటర్ ద్వారా హియరింగ్ పరీక్షలు చేసి రిపోర్టు అందజేస్తామని పేర్కొన్నారు. హియరింగ్ ఎయిడ్స్ అవసరం వుంటే తక్కువ ధరతో ఏర్పాటు చేస్తామని చెప్పారు. వివరాలకు 9849085342లో సంప్రదించాలని కోరారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

తడ: మండలంలోని తడ, అక్కంపేట రైల్వే స్టేషన్‌ల మధ్య శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి రైలుకింద పడి మృతి చెందినట్టు జీఆర్‌పీ ఎస్ఐ మాలకొండయ్య తెలిపారు. 50 ఏళ్లు ఉంటాయని, తల, మొండెం వేరైనట్టు పేర్కొన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

చంద్రగిరిలో దారుణం

- భార్య వివాహేతర సంబంధంపై సోషల్ మీడియాలో పోస్టు చేసిన భర్త
- బాధితుడిని చితకబాది, సైలెన్సర్‌తో కాల్చి గుండు కొట్టించిన వైనం
- ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు?
- నిందితుల్లో ఒకరు టీడీపీ నాయకుడి బంధువు

చంద్రగిరి: తన భార్యతో వివాహేతర సంబంధం పెట్టుకోవడంతో ఆవేదన చెందిన భర్త వారిద్దరూ మృతిచెందారని సోషల్ మీడియాలో పోస్టు చేశాడు. దీంతో భార్య ప్రియుడు అతనిపై దాడికి పాల్పడి, గుండు కొట్టించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని ఏ.రంగంపేటకు చెందిన హరికృష్ణ నాయుడు కుమారుడు వంశీ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సోషల్ మీడియా ద్వారా పరిచయమైన తెలంగాణలోని కరీంనగర్‌కు చెందిన మహిళను మూడేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఆటో యజమాని తిరుపతి రూరల్ ముస్లింపేటకు చెందిన అన్వర్ తరచూ వంశీ వద్దకు వచ్చి వెళుతూ అతని భార్యతో వివాహేతర సంబంధం ఏర్పరుచుకున్నాడు. వంశీ భార్య రెండు నెలల క్రితం పుట్టింటికి వెళ్లిపోతున్నానని చెప్పి ప్రియుడు అన్వర్ చెంతకు చేరింది. నెలన్నర క్రితం వంశీ బెంగళూరులో పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. తన భార్య ఫేస్‌బుక్‌లో మరో వ్యక్తితో ఉన్నట్లు గుర్తించాడు. గత నెల 13న తన భార్యతో పాటు అన్వర్ చనిపోయాడంటూ ఫేస్‌బుక్‌లో మెస్సేజ్ పోస్టు చేశాడు. దీన్ని జీర్ణించుకోలేని అన్వర్, చంద్రగిరికి చెందిన తన స్నేహితుడు హర్షతో కలిసి బెంగళూరులోని వంశీని కిడ్నాప్ చేసి చంద్రగిరికి తీసుకొచ్చారు. కొంత మంది స్నేహితులతో కలిసి వంశీను చిత్ర హింసలకు గురిచేశారు. సైలెన్సర్‌తో కాల్చారు. తలపై మూత్రం పోసి గుండు కొట్టించి వీడియోలు చిత్రీకరించారు. అనంతరం బాధితుడిని బెదిరించి.. అన్వర్ అనే వ్యక్తిపై తప్పుగా పోస్టులు పెట్టానని, అందుకు ప్రాయశ్చితంగా గుండు కొట్టించుకున్నట్లు బలవంతంగా ఓ వీడియోను చిత్రీకరించి వైరల్ చేశారు. వారి దురాగతం శుక్రవారం వైరల్ కావడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. వీడియో ఆధారంగా అన్వర్, హర్షను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. బాధితుడు కనిపించకుండా పోవడంతో పోలీసులు గాలిస్తున్నట్టు తెలిసింది.



వంశీకి గుండు కొటిస్తున్న నిందితులు

నిందితుల్లో ఒకరు టీడీపీ నాయకుడి బంధువు

వంశీని చిత్రహింసలకు గురి చేసిన ఘటనలో ప్రధాన నిందుతుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న అన్వర్ చంద్రగిరికి చెందిన టీడీపీ నాయకుడికి సమీప బంధువని తెలిసింది. పోలీసులు శుక్రవారం రాత్రి నిందితులను అదుపులోకి తీసుకున్నట్టు తెలియడంతో ఆ నాయకుడు కేసును నీరు గార్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై పోలీసులు స్పందించడంపోవడంపై పలు అనుమానాలకు తావిస్తోంది.

చిరుత కలకలం

పాకాల: మండలంలోని లింగనపల్లి పంచాయతీ పరిధిలో శుక్రవారం చిరుత సంచరిస్తూ కలకలం రేపింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు ఆటో డ్రైవర్ రమేష్ శుక్రవారం ఉదయం 5 గంటల ప్రాంతంలో పెనుమూరు వెళుతుండగా సబ్‌స్టేషన్ సమీపంలో చిరుత రోడ్డుకు తూర్పు నుంచి పడమర వైపు వస్తోంది. ఆటో లైట్ వెలుతురు పడడం, హారన్ వేయడంతో వెనుదిరిగి గుట్టలోకి వెళ్లిపోయినట్లు తెలిపారు. సమాచారాన్ని వెంటనే అటవీ సిబ్బందికి సమాచారం అందజేశారు. ఉదయం 11 గంటలకు అటవీ సిబ్బంది అక్కడకు చేరుకుని పరిసరాలను పరిశీలించి చిరుత సంచారం ఉందని గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. అచ్చమ్మ అగ్రహారం, గాండ్లపల్లి, లింగనపల్లి, కవాలివారిపల్లి గ్రామస్తులు జాగ్రత్తగా ఉండాలని అటవీ అధికారులు సూచనలు చేశారు.

భూమనపై లోకేష్ విమర్శలు అర్థరహితం



మాట్లాడుతున్న హరిప్రసాద్‌నాయక్

తిరుపతి కల్చరల్: రాజకీయ పరిజ్ఞానం లేని నారా లోకేష్ తిరుపతి అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డిపై విమర్శలు చేయడం అర్థ రహితమని వైఎస్సార్ విద్యార్థి విభాగం రాష్ట్ర నేత హరిప్రసాద్‌నాయక్ తెలిపారు. ఆయన శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. రాజకీయం అంటే రాసలీలలు కాదని, ప్రజా ఆదరణ కలిగిన వారే నాయకుడన్న విషయాన్ని నారా లోకేష్ గుర్తించాలన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెన పథకాలను తొలగిస్తానని లోకేష్ చెప్పడం బడుగు, బలహీనవర్గాల పట్ల ఆయనకున్న ప్రేమ అర్థమవుతోందని పేర్కొన్నారు. ఇప్పటికైనా విమర్శలు మానుకోవాలని, లేని పక్షంలో పాదయాత్రను అడ్డుకుంటామని హెచ్చరించారు. వైఎస్సార్ విద్యార్థి సంఘం నేతలు శివ, నాగరాజు, సందీప్‌కుమార్ పాల్గొన్నారు.

రెండు ద్విచక్రవాహనాలు ఢీ

– ఒకరి మృతి



మృతి చెందిన లాల్‌బాషా

చంద్రగిరి: ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటలో ఒకరు మృతి చెందగా, మరొకరు గాయపడిన ఘటన పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారి తొండవాడ సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. చిత్తూరుకు చెందిన లోకేష్ తిరుపతిలోని ఓ ప్రైవేటు కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్నాడు. శుక్రవారం ఉదయం చిత్తూరు నుంచి విధులకు హాజరయ్యేందుకు తన ద్విచక్ర వాహనంలో తిరుపతికి పయనమయ్యాడు. ఈ క్రమంలో చంద్రగిరి ఇందిరమ్మ కాలనికి చెందిన లాల్‌బాషా(35) మరో వృద్ధుడితో కలిసి ద్విచక్ర వాహనంలో చంద్రగిరి వైపుగా వస్తున్నాడు. ఈ క్రమంలో తొండవాడ సమీపంలో ఎదురుగా వస్తున్న లోకేష్ ద్విచక్ర వాహనాన్ని లాల్ బాషా ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన లాల్ బాషా అక్కడికక్కడే మృతిచెందగా.. మరో వృద్ధుడు, లోకేష్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. చంద్రగిరి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను తిరుపతి రుయాకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలుడి ఆత్మహత్య



వంశీ (ఫైల్)

కేవీబీపురం: కేవీబీపురం దళితవాడలో శుక్రవారం బాలుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. దళితవాడకు చెందిన చంద్రయ్య కుమారుడు వంశీ(16) కూలి పనులు చేస్తూ తల్లిదండ్రులకు ఆసరాగా ఉంటున్నాడు. ఏమి జరిగిందో కాని శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సునీల్ తెలిపారు.

నిరంతర నిఘా



ఎంఆర్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి

- దొంగతనాలను అరికట్టడమే లక్ష్యం
- మారుమూల నివాస ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి
- ప్రతి ఇంటికీ సీసీ కెమెరాల ఏర్పాటుపై అవగాహన
- రహదారులు, అక్రమ రవాణాపై ఉక్కుపాదం
- ముత్యాలరెడ్డిపల్లి పోలీస్ స్టేషన్ తనిఖీలో ఎస్పీ వెల్లడి

సాక్షి, తిరుపతి: ‘దొంగతనాలు.. అక్రమ రవాణాను అరికట్టేందుకు జిల్లా పోలీసు యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. ప్రతి ఇంటికీ సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజల్లో అవగాహన కల్పించాలని నిర్ణయించింది. ఈ మేరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలి’అని ఎస్పీ పీ పరమేశ్వర్‌రెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. తిరుపతి రూరల్ మండలం, ముత్యాలరెడ్డిపల్లి పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఎస్‌హెచ్ఓ, పోలీస్ స్టేషన్ సిబ్బంది పనితీరుపై సమీక్షించి జనరల్ డైరీ, కేసు డైరీ, కోర్టు క్యాలెండర్ వంటి పలు రికార్డులను పరిశీలించారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని మారుమూల నివాస ప్రాంతాలపై నిరంతనిఘా పెంచాలని సిబ్బందిని ఆదేశించారు. అక్రమరవాణాను అరికట్టే విషయంలో రాజీపడే ప్రసక్తే లేదన్నారు. జాతీయ రహదారులపై నిరంతర నిఘా ఉంచాలన్నారు. బహిరంగ ప్రదేశాలలో మత్తు పదార్థాలు సేవించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

పెండింగ్ కేసుల పరిష్కారంపై దృష్టి

పోలీస్ స్టేషన్లలో పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారంపై ఎస్పీ ప్రత్యేక దృష్టి సారించారు. అందులో భాగంగా ఎంఆర్‌పల్లి పోలీస్‌స్టేషన్ తనిఖీలోనూ పెండింగ్ కేసుల గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. కేసులను సకాలంలో దర్యాప్తు చేసి బాధితులకు సరైన న్యాయం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. మహిళా సంబంధిత నేరాలపై వెంటనే స్పందించాలన్నారు.

సిబ్బందితో మమేకమైన ఎస్పీ

పోలీస్ స్టేషన్ సిబ్బందితో సమావేశమైన ఎస్పీ వారి సాదకబాదలను అడిగి తెలుసుకున్నారు. వారికి పలు సూచనలు చేశారు. క్రమశిక్షణతో అలసత్వం లేకుండా విధులు నిర్వహించాలని చెప్పారు. ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా విధుల్లో మానవతా దృక్పథంతో నిక్కచ్చిగా ఉండాలన్నారు. స్టేషన్‌కు వచ్చే బాధితులతో మర్యాదగా ప్రవర్తిస్తూ వారికి మేమున్నామనే ధైర్యాన్ని ఇచ్చి భరోసా కల్పించాలని చెప్పారు. మహిళా సంరక్షణ కార్యదర్శుల పనితీరుపై సమీక్షించిన అనంతరం వారితో మాట్లాడుతూ నేటి సమాజంలో గృహ నిర్బంధ మహిళా సంబంధిత విషయాలను, బాలికలు ఎదుర్కొంటున్న ఈవ్ టీజింగ్, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, పోక్సో చట్టం వంటి విషయాలపై పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. బాలికల పట్ల ఉపాధ్యాయుల అసభ్య ప్రవర్తనపై ఆరాతీసి ఏదేని అనుకోని సంఘటనలు జరిగి ఉంటే వెంటనే ఎస్‌హెచ్ఓలకు తెలియజేసేవిధంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఎస్పీ వెంట తిరుపతి వెస్ట్ డీఎస్పీ నరసప్ప, సీఐలు సురేంద్రరెడ్డి ఎమ్ఆర్.పల్లి, చంద్రశేఖర్‌పిళ్లై, డీసీఆర్‌బీ ఎస్ఐలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

న్యాయవాది వృత్తి ఉన్నతమైంది

తిరుపతి లీగల్: న్యాయవాది వృత్తి ఉన్నతమైందని, దానికి గౌరవం తీసుకురావాల్సిన బాధ్యత యువ న్యాయవాదులపై వుందని తిరుపతి మూడో అదనపు జిల్లా జడ్జి వై.వీర్రాజు తెలిపారు. తిరుపతి న్యాయవాదుల అసోసియేషన్ హాల్‌లో శుక్రవారం సీనియర్ న్యాయవాదులు టీకే అల్తాఫ్‌హుస్సేన్, ఎం.అబ్దుల్‌రఫీక్, సయ్యద్ గౌస్‌అలీ చిత్రపటాలను తిరుపతి ముస్లిం లాయర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఎర్రచందనం కేసుల విచారణ కోర్టు జడ్జి నాగరాజు, ఐదో అదనపు జిల్లా జడ్జి అన్వర్‌బాష, సీనియర్ సివిల్ జడ్జిలు శ్రీనివాసరావు, శిరీష్, జూనియర్ సివిల్ జడ్జిలు కోటేశ్వరరావు, సరిత, తిరుపతి న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు దినకర్, ముస్లిం లాయర్స్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు ఎస్ఎస్ జాన్, జాకీర్‌హుస్సేన్, అక్బర్ బాష, మౌలా పాల్గొన్నారు.

ప్రత్యేక మేజిస్ట్రేట్‌కు సన్మానం



మేజిస్ట్రేట్ శ్రీనివాసులును సన్మానిస్తున్న కోర్టు సిబ్బంది

తిరుపతి లీగల్: తిరుపతి 2వ ప్రత్యేక కోర్టు మేజిస్ట్రేట్‌గా పనిచేస్తూ శుక్రవారం ఉద్యోగ విరమణ చేసిన శ్రీనివాసులును కోర్టు సిబ్బంది ఘనంగా సన్మానించారు. శాలువా కప్పి జ్ఞాపిక అందజేశారు. దామోదర్, మోహన్ పాల్గొన్నారు.

గ్యాస్ ధర పెంపుపై నిరసన



గ్యాస్ సిలిండర్లతో నిరసన తెలుపుతున్న సీపీఐ నేతలు

తిరుపతి అర్బన్: వంట గ్యాస్ ధరలు పెంచి సామాన్యులపై అధిక భారం మోపడం తగదని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు, జిల్లా కార్యదర్శి మురళి తెలిపారు. వారు శుక్రవారం ఏపీ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో తిరుపతి రైల్వే స్టేషన్ వద్ద గ్యాస్ సిలిండర్లకు పూజలు చేసి వినూత్నంగా నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ 2014లో రూ.410 ఉన్న గ్యాస్ సిలిండర్ ధర నేడు రూ.1,150లకు చేరిందన్నారు. బేరల్ రేటు తగ్గినా పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గడం లేదన్నారు. 2024లో బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించడానికి సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

రుయాలో వెలుగు చూస్తున్న అక్రమాలు

- మొన్న సంతకాల ఫోర్జరీ
- నిన్న ఆరోగ్యశ్రీ ఆసరా నిధులు స్వాహా
- విచారణ చేపట్టిన కమిటీ

తిరుపతి తుడా : రాయలసీమ పెద్దాస్పత్రిగా పేరొందిన రుయాలో అక్రమాలు వెలుగు చూస్తూనే ఉన్నాయి. ఉన్నతాధికారులు ఉదాసీనతంగా వ్యవహరిస్తుండడంతో అక్రమార్కులు చెలరేగిపోతున్నారు. ప్రభుత్వం వైద్య రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నా అక్రమార్కుల వల్ల రుయా ప్రతిష్ట దెబ్బతింటోంది.

అతీగతీ లేని సంతకాల ఫోర్జరీ కేసు

గత ఏడాది నవంబర్‌లో చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ ఉద్యోగి శేఖర్ వద్ద అధికమొత్తంలో డబ్బు తీసుకుని మెడికల్ కమిటీ సభ్యుల సంతకాలను ఫోర్జరీ చేసి మెడికల్ ఇన్ వ్యాలిడేషన్ సర్టిఫికెట్‌ను మంజూరు చేశారు. దీనిపై చిత్తూరు జిల్లా కలెక్టర్ ఆదేశంతో డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీహరి విచారణ చేసి నివేదిక అందజేశారు. అనంతరం త్రిసభ్య కమిటీ లోతైన విచారణ చేపట్టి పూర్తి నివేదికను చిత్తూరు కలెక్టర్‌కు అందజేసింది. తర్వాత ఆ కేసు ఏమైందో తెలియదు. తాజాగా వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ఆసరా పథకం కింద ప్రభుత్వం రోగులకు మంజూరు చేసే నిధుల స్వాహా పర్వం వెలుగులోకి వచ్చింది. సాధారణంగా వ్యాధిని బట్టి రోగికి ప్రభుత్వం రోజుకు రూ.225 చొప్పున రూ.25 వేల నుంచి రూ.60 వేల వరకు మంజూరు చేస్తుంది. ఈ నిధులు రోగి డిశ్చార్జ్ అయిన రోజే వారి అకౌంట్‌లో జమవుతాయి. ఈ నిధులను డేటా ఎంట్రీ ఆపరేటర్లు తిరుమల, శివ, చెంచయ్య నకిలీ ఐడీలు, ఇతర రోగుల స్కానింగ్ రిపోర్టులను అప్‌లోడ్ చేసి రూ.లక్షల నిధులు స్వాహా చేశారు. ఈ విషయం వెలుగులోకి రావడంతో అధికారుల ఫిర్యాదు మేరకు వారిపై అలిపిరి పోలీసులు కేసు నమోదు చేశారు. అలాగే జిల్లా కలెక్టర్ కమిటీ ఏర్పాటు చేసి లోతైన విచారణకు ఆదేశించారు. దీంతో అధికారులు శుక్రవారం విచారణ చేపట్టారు. గడిచిన మూడు నెలల్లో 180 మంది రోగులకు ఆసరా డబ్బులు విడుదలయ్యాయి. ఇందులో ఎన్ని నకిలీ పేర్లతో డబ్బులు కాజేశారన్న దానిపై విచారణ చేస్తున్నారు.



నిధుల స్వాహాపై విచారణ కమిటీ సభ్యులతో చర్చిస్తున్న రుయా ఇన్‌చార్జి సూపరింటెండెంట్

పరిశీలిస్తున్నాం

ఆరోగ్యశ్రీ ఆసరా నిధుల గోల్‌మాల్ వ్యవహారంపై త్రిసభ్య కమిటీ క్షుణ్ణంగా పరిశీలిస్తోంది. డేటా ఎంట్రీ ఆపరేటర్లపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇందులో ఇంకా ఎవరి పాత్ర అయినా వుందా అని పరిశీలించాల్సి ఉంది. –డాక్టర్ నాగమునీంద్రుడు, ఇన్‌చార్జి సూపరింటెండెంట్

ఘనంగా గంధోత్సవం

తిరుపతి కల్చరల్: ఎస్వీ యూనివర్సిటీ సమీపంలోని ఈద్గా మైదానంలో శుక్రవారం ఏడుగురు బాబాల గంధోత్సవం ఘనంగా నిర్వహించారు. ఇందులో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ శిరీష పాల్గొని ప్రార్థనలు చేశారు. ఈద్గా, దర్గా మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు రఫీ హిందూస్తానీ, చాంద్‌బాషా, ఇస్మాయిల్, ముర్తుజా మాట్లాడుతూ 106 ఏళ్లుగా కమిటీ ఆధ్వర్యంలో దర్గాలోని ఏడుగురు బాబాల గంధోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ ముర్తుజా, ఫరీద్‌భాయ్, అన్వర్ భాయ్, ఐఎస్ మౌలా, షాది మహల్ చైర్మన్ గఫూర్, కడప అమీర్ పీర్ దర్గా పీఠాధిపతి శిష్య బృందం పాల్గొన్నారు.



దర్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే భూమన, ఈద్గా, దర్గా మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు

మెకానిక్కులకు ఆర్థిక సాయం

తిరుపతి కల్చరల్: వెన్నెముక ఆపరేషన్ చేసుకున్న మెకానిక్ గజేంద్ర, చేతి ఎముక క్రాక్‌తో చికిత్స పొందుతున్న మెకానిక్ చిత్తూరు రవికి రూ.10 వేల చొప్పున తిరుపతి టూ వీలర్స్ మెకానిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆవుల మునిరెడ్డి శుక్రవారం ఆర్థిక సాయం అందించారు. అండగా ఉంటామన్నారు. అసోసియేషన్ ప్రతినిధులు మల్లేశ్వరం, కృష్ణారెడ్డి, లక్ష్మణరావు, డి.రాము, జె.లక్ష్మణ్, గురువిష్ణు, ఎ.భార్గవ్, ప్రసాద్, వైకుంఠపతి పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణంపై వివాదం

చంద్రగిరి: మండలంలోని మతంపల్లిలో శుక్రవారం ఆలయ నిర్మాణంపై రెండు వర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. గ్రామంలో సర్వే నంబరు 777లో ఉన్న గ్రామకంఠం భూమిలో అమ్మవారి ఆలయ నిర్మాణం చేపట్టేందుకు గ్రామస్తులు పూనుకున్నారు. దీన్ని కొందరు అడ్డుకున్నారు. ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకోవడంతో ఎస్ఐలు హిమబిందు, వంశీధర్ అక్కడికి చేరుకుని వారితో మాట్లాడారు. కొంతమంది తహసీల్దార్ శిరీషను కలిశారు. ఘర్షణ వాతావరణం లేకుండా రెండు వర్గాల వారు చర్చించుకుని సమస్యను పరిష్కరించుకోవాలని ఆమె సూచించినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

విద్యా సామగ్రి వితరణ

తిరుపతి కల్చరల్: భవానినగర్‌లోని నగర పాలక ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలోని పేద విద్యార్థులకు శుక్రవారం లయన్స్ క్లబ్ ఆఫ్ తిరుపతి సెవెన్ హిల్స్ ప్రతినిధులు వంటకు ఉపయోగించే ప్రెజర్ కుక్కర్, నోట్‌బుక్స్, కాపీ రైటింగ్ బుక్స్, బిస్కెట్లను వితరణ చేశారు. లయన్స్ క్లబ్ ఆఫ్ తిరుపతి సెవెన్ హిల్స్ అధ్యక్షుడు ఆర్కాట్ కృష్ణప్రసాద్, కార్యదర్శి వి.జగన్నాథం, లయన్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధి రాజేంద్రప్రసాద్, బెల్లంకొండ సురేష్, రోహిత్, ప్రధానోపాధ్యాయుడు దేవరాజులు పాల్గొన్నారు.

నాడు-నేడు పనుల పరిశీలన

రామచంద్రాపురం: మండలంలోని కేకేవీపురం ఉన్నత పాఠశాలలో జరుగుతున్న నాడు–నేడు పనులను తిరుపతి జిల్లా సమగ్రశిక్ష సెక్టోరియల్ అధికారులు ఏపీఓ గోపాలక్రిష్ణ, ఐఈ కోఆర్డినేటర్ రామచంద్రారెడ్డి, ఏఎస్ఓ రుక్మాంగద శుక్రవారం పరిశీలించారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, బిల్లులను ఆన్‌లైన్‌లో పొందుపరచాలని తెలిపారు. కుప్పంబాదూరు, కమ్మకండ్రిగ పాఠశాలల్లో మొదటి దశలో చేపట్టిన నాడు–నేడు పనుల నాణ్యతను తనిఖీ చేశారు. నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

జడ్జికి అదనపు బాధ్యతలు

తిరుపతి లీగల్: తిరుపతి మొదటి, రెండో ప్రత్యేక మేజిస్ట్రేట్ కోర్టులకు ఇన్‌చార్జి న్యాయమూర్తిగా తిరుపతి 4వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధి శ్రీనివాస్‌ను నియమిస్తూ జిల్లా కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన శుక్రవారం ఉద్యోగ విరమణ చేసిన మేజిస్ట్రేట్ శ్రీనివాసులు నుంచి బాధ్యతలు స్వీకరించారు.

కూలీలకు ఉపాధి కల్పించడమే లక్ష్యం



మారసానివారిపల్లె వద్ద కూలీలతో మాట్లాడుతున్న పీడీ శ్రీనివాస్‌ప్రసాద్

భాకరాపేట: కూలీలకు ఉపాధి కల్పించడమే ఉపాధి హామీ పథకం లక్ష్యమని తిరుపతి జిల్లా డ్వామా పీడీ శ్రీనివాస్‌ప్రసాద్ తెలిపారు. ఆయన శుక్రవారం చిన్నగొట్టిగల్లు మండలం జంగావాండ్లపల్లె పంచాయతీ మారసానివారిపల్లె దళితవాడ చెరువులో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పనికి తగ్గ వేతనం వచ్చేలా పనులు చూపించాలని సూచించారు. చిన్నగొట్టిగల్లు పంచాయతీ చిట్టేవాండ్లపల్లె చెరువులో జరుగుతున్న అమృత్ సరోవర్ పనులను పరిశీలించారు. పంచాయతీలకు తెలియకుండా పనులు చేపట్టినట్లు ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏపీవో మృత్యుంజయరావు, ఈసీ రెడ్డెప్ప పాల్గొన్నారు.

39 మందికి జరిమానా

తిరుపతి లీగల్: తిరుమలలో వివిధ నేరాలకు పాల్పడిన 39 మందికి రూ.22,200 జరిమానా విధిస్తూ తిరుపతి 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి పల్లపోలు కోటేశ్వరరావు శుక్రవారం తిరుమల క్యాంప్ కోర్టులో తీర్పు చెప్పారు. అలాగే తిరుమల ట్రాఫిక్ ఎస్ఐ రామచంద్రానాయక్ జీఎన్‌సీ టోల్‌గేట్, తిరుపతి అలిపిరి టోల్‌గేట్ల వద్ద తనిఖీ చేపట్టి మద్యం తాగి తిరుమలకు వెళుతున్న 8 మందిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. వారిలో ఒక్కొక్కరికి రూ.2 వేలు చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. తిరుమలలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న 31 మందిని తిరుమల పోలీసులు కోర్టులో హాజరుపరిచారు.

7న మండల సమావేశం

తిరుపతి రూరల్: మండల సర్వసభ్య సమావేశం 7న నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వెంకటనారాయణ తెలిపారు. చిత్తూరు, తిరుపతి ఎంపీలు, చంద్రగిరి, తిరుపతి ఎమ్మెల్యేలు, జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్సీలు పాల్గొంటారని, ప్రజా ప్రతినిధులు, మండల స్థాయి అధికారులు పాల్గొనాలని కోరారు.

వందల కోట్లతో తిరుపతి అభివృద్ధి

తిరుపతి తుడా : తిరుపతి నగరాన్ని రూ.వందల కోట్లతో అభివృద్ధి చేస్తున్నామని మేయర్ శిరీష తెలిపారు. ఆమె శుక్రవారం డిప్యూటీ మేయర్లు భూమన అభినయ్ రెడ్డి, ముద్రనారాయణతో కలిసి శ్రీనివాస సేతు ఫ్లైఓవర్ మూడో దశ, మాస్టర్ ప్లాన్ రోడ్ల పనులను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ శ్రీనివాస సేతు మూడో దశ పనులు రేణిగుంట రోడ్డు – ఆర్టీసీ బస్టాండు, మార్కెట్ యార్డు–ఆర్టీసీ బస్టాండు వరకు యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్నాయన్నారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు. డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి మాట్లాడుతూ తిరుపతి నగర తూర్పు ప్రాంతం అభివృద్ధికి నోచుకోలేదన్నారు. అందుకోసమే ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను డెవలప్ చేస్తున్నామన్నారు. కనెక్టివిటీ పెంచడం, ట్రాఫిక్ ఒత్తిడి తగ్గించడం, తూర్పు ప్రాంతం 2,500 ఎకరాల్లో నగరం విస్తరింపజేయడమే లక్ష్యంగా 14 మాస్టర్‌ప్లాన్ రోడ్లను అభివృద్ధి చేస్తున్నామన్నారు. కార్పొరేటర్లు కోటూరు ఆంజనేయులు, గణేష్, పుల్లూరు అమరనాథరెడ్డి, శేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉదయ్‌వంశీ, చింతలచేను గోపి, దొడ్డారెడ్డి మురళీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



శ్రీనివాససేతు వంతెన పనులను పరిశీలిస్తున్న మేయర్ శిరీష, డిప్యూటీ మేయర్లు

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

తిరుపతి రూరల్: తిరుపతి నగరంలో విద్యుత్ ఉప కేంద్రాలు, విద్యుత్ లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మలు తొలగింపు కారణంగా శనివారం సరఫరా నిలిపేస్తున్నట్టు ఎస్పీడీసీఎల్ తిరుపతి డివిజన్ ఎస్ఈ వాసుదేవ రెడ్డి తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు దొడ్డాపురం వీధి, కెకె స్ట్రీట్, రెడ్డి అండ్ రెడ్డి కాలనీ, టీకేస్ట్రీట్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా వుండన్నారు.

మాణిక్యాంబదేవికి విశేష పూజలు

భాకరాపేట: చిన్నగొట్టిగల్లులోని శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో వెలసిన మాణిక్యాంబదేవికి శుక్రవారం విశేష పూజలు చేశారు. శుక్ల ఏకాదశిని పురస్కరించుకుని అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు.